సాక్షి విశాఖపట్నం

సోమవారం ¦ 29 ¦ ఏప్రిల్ ¦ 2024



'సాక్షి' మాక్ ఈఏపీసెట్‌కు విశేష స్పందన 8లో



పలు రైళ్ల రద్దు

కోరాపుట్ - రాయగడ, టికిరి - సింగారం - లక్ష్మీపూర్ రోడ్ మధ్య పలు రైళ్లు రద్దు చేశారు. 12లో



జాగ్రత్త సుమా..!

వేసవిలో వాహన ప్రమాదాలకు ఆస్కార ముంటుంది. బ్యాటరీ, రేడియేటర్లను తరచూ పరిశీలిస్తుండాలి. 12లో

న్యూస్‌రీల్

జిల్లా ఓటర్లు 20,12,373

గాజువాక మినహా మిగిలిన చోట్ల మహిళా ఓటర్లే అధికం

మహారాణిపేట: జిల్లాలో తుది ఓటర్ల జాబితా సిద్ధమైంది. మే 13న ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్ల సంఖ్య ప్రస్తుతం 20,12,373కు చేరుకుంది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఈ నెల 21వ తేదీ నాటికి తుది ఓటరు జాబితాను అధికారులు సిద్ధం చేశారు. వీరందరికీ మే 13న జరిగే పోలింగ్‌లో ఓటు హక్కు కలిస్తున్నారు. ఇక కొత్తగా ఓటర్లను నమోదు చేయడం, తొలగింపు, దిద్దుబాటుకు అవకాశం లేదు. భీమిలిలో అత్యధిక శాతం మంది ఓటర్లు ఉండగా, విశాఖ పశ్చిమలో అత్యల్పంగా ఉన్నారు. జిల్లాలో మొత్తం మీద మహిళా ఓటర్లే అధికం. గాజువాక మినహా అన్ని నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.

అసెంబ్లీ	మొత్తం
భీమిలి	3,63,013
విశాఖ తూర్పు	2,92,206
విశాఖ దక్షిణ	2,16,770
విశాఖ ఉత్తర	2,85,789
విశాఖ పశ్చిమ	2,13,439
గాజువాక	3,33,611
పెందుర్తి	3,07,545
మొత్తం	20,12,373

ఏపీసెట్‌కు విశాఖలో 79.25 శాతం హాజరు



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన రాష్ట్ర స్థాయి అర్హత పరీక్ష ఏపీసెట్-2024కు విశాఖ ప్రాంతీయ కేంద్రం పరిధిలో 79.25 శాతం హాజరు నమోదైంది. విశాఖ ప్రాంతీయ కేంద్రం పరిధిలో 20 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షకు 9311 అభ్యర్థులు దరఖాస్తు చేయగా.. 7379 మంది హాజరయ్యారు. పరీక్షకు 1932 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఏపీసెట్ మెంబర్ సెక్రటరీ ఆచార్య జి.ఎం.జె.రాజు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు ఆదివారం ఉదయం సందర్శించారు.

వైఎస్సార్ సీపీలోకి జాతీయ క్రికెటర్ కమలాకర్



సీతమ్మధార(విశాఖ ఉత్తర): కాంగ్రెస్ పార్టీలో తనకు అవమానం జరగడంతో ఆ పార్టీ కి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ఉత్తర నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు, జాతీయ క్రికెట్ ఆటగాడు కమలాకర్ తెలిపారు. ఆదివారం గురుద్వార్ దరి ఓ గెస్ట్ హౌస్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర కాంగ్రెస్ టికెట్ తనకు కాకుండా గాజువాకకు చెందిన వ్యక్తికి ఇవ్వడంతో అవమానం తట్టుకోలేక రాజీనామా చేసి సోమవారం వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు వెల్లడించారు. కేకేరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టో అద్భుతంగా ఉందన్నారు. ఉత్తర నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కేకేరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు.

మీ అంతు చూస్తా..?

నా పేరు గణ.. నా అరాచకాలేంటో.. పదేళ్లలో చూసే ఉంటారు. ఈ ఎన్నికల్లో మీరు సపోర్ట్ చేయకపోతే నా గూండాయిజం మళ్లీ చూస్తారు. నా వెంట లేకపోతే మీ అంతు చూస్తా.. ఖబడ్దార్.. ఈ డైలాగ్‌లు ఏదో యాక్షన్ సినిమాలో వీధి రౌడీ చెప్పిన మాటలు కాదు.. పశ్చిమ నియోజకవర్గ ప్రజలు రెండు పర్యాయాలు గుణవంతుడని ఎమ్మెల్యేగా ఎన్నుకున్న అక్రమాల గణబాబు హెచ్చరికలు. ఓటమి భయంతో.. టీడీపీ అధినేత చంద్రబాబు ఎలాగైతే.. ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారో.. అదే తానుముక్కైన గణబాబు కూడా బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతున్నారు.



- గణబాబు బెదిరింపు రాజకీయాలు
- సహకరించకపోతే వ్యాపారాలు సాగనివ్వనంటూ వ్యాపారులకు హుకుం
- తన వెంట ఉండకపోతే ఉద్యోగాలు తీసేస్తానంటూ ఆర్పీలకు హెచ్చరిక
- తన మాట విననివారిపై పాతఫొటోలతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు

సాక్షి, విశాఖపట్నం: ప్రచారం పేరుతో విశాఖ పశ్చిమ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి గణబాబు వస్తున్నాడంటే వ్యాపారులు బెదిరిపోతున్నారు. చిన్న చిన్న దుకాణదారులు హడలిపోతున్నారు. బడా బంగారు వ్యాపారులు భయపడుతున్నారు. ఆర్పీలు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుపై తోపుడు బళ్ల వ్యాపారులు బిక్కుబిక్కుమంటున్నారు. ఎవరు కనిపించినా.. నవ్వుతూ పలకరిస్తూ.. ఆత్మీయ ఆలింగనం చేసుకుంటూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ ఓటర్లను అభ్యర్థిస్తుంటే.. టీడీపీ అభ్యర్థి గణబాబు మాత్రం బెదిరింపు రాజకీయాలతో బెదరగొడుతున్నారు.

బెదిరింపులకు నాలుగు బ్యాచ్‌లు

ఎన్నికల్లో తనకు సహకరించకపోతే భవిష్యత్‌లో సమస్యలు తప్పవని గణబాబు.. నియోజకవర్గంలోని వ్యాపారస్తులు, వ్యాపార సంస్థల యజమానులను బెదిరిస్తున్నారని కొందరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వ్యాపారులను బెదిరించేందుకు గణబాబు తన అనుచరులను నాలుగు బ్యాచ్‌లుగా విభజించి.. వస్త్ర వ్యాపారులను ఒక బ్యాచ్, బంగారు వ్యాపారులను మరో బ్యాచ్, కిరాణా దుకాణాలవైపు ఇంకో బ్యాచ్, మిగిలిన వాటిని కవర్ చేస్తూ మరో బ్యాచ్ పశ్చిమ నియోజకవర్గంలో హల్‌చల్ చేస్తున్నాయి. ఆయా వర్తక సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను గణబాబు రప్పించుకొని వేలు చూపిస్తూ హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు సమాచారం. ఇలాంటి వ్యక్తి గెలిస్తే నియోజకవర్గాన్ని గూండాల చేతిలో పెట్టేటట్లుగా ఉన్నారంటూ వ్యాపారులు హడలిపోతున్నారు.

ఫిర్యాదులు చేస్తామని ఆర్పీలకు బెదిరింపు

స్వయం సహాయక బృందాల్లో కీలకంగా వ్యవహరించే రిసోర్స్ పర్సన్స్(ఆర్పీ) ఏ ఒక్క పార్టీకి కొమ్ముకాయకుండా వ్యవహరిస్తున్నారు. అయితే.. వీరిపైనా గణబాబు బెదిరింపుల బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తూ వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ఇటీవలే కొందరు ఆర్పీలను మభ్యపెట్టేందుకు కానులపేర్లను బహూకరించారు. ఆర్పీలు తీసుకోమని చెప్పడంతో వారందర్నీ బెదిరించారు. దీంతో ఒకరిద్దరు గణబాబు గూండాయిజానికి భయపడి తీసుకున్నారు. మిగిలిన వారు మాత్రం తాము ఏ పార్టీకి సపోర్ట్ చేయమనీ.. స్వయం సహాయక బృందాల అభివృద్ధి కోసమే తమని ప్రభుత్వాలు నియమించాయని కరాఖండిగా చెప్పడంతో గణబాబు అహం దెబ్బతింది. దీంతో తనకు సహకరించని ఆర్పీలపై గణబాబు వర్గం ఎన్నికల సంఘానికి తప్పుడు ఫిర్యాదులు చేయడం ప్రారంభించింది. గతంలో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్న ఫొటోల్ని సంపాదించి.. ఆ ఫొటోలతో బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని కొందరు ఆర్పీలు వాపోతున్నారు. పాత ఫొటోల ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ముందుగా ఆర్పీలకు ఆ ఫొటోలు చూపించి.. మీరు తన తరఫున ప్రచారం చేయకపోతే.. ఈ ఫొటోలతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాననీ.. అప్పుడు మీ ఉద్యోగాలు ఊడిపోతాయంటూ గణబాబు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. గణబాబు బ్లాక్ మెయిల్ రాజకీయాలు పశ్చిమ నియోజకవర్గాన్ని కుదిపేస్తున్నాయి. దిగజారుడు బెదిరింపులతో చిల్లర రాజకీయాలు చేస్తున్న గణబాబు అరాచకాలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధమవుతున్నారు.

నేడు చోడవరంలో సీఎం జగన్ ప్రచారభేరి

- ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తూరు జంక్షన్‌లో బహిరంగ సభ
- సభా ఏర్పాట్లు పరిశీలించిన వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే ధర్మశ్రీ
- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన పోలీసులు
- ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు, ప్రజలు సిద్ధం



సాక్షి, అనకాపల్లి: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో చేపట్టిన సిద్ధం సభలు విజయవంతమయ్యాయి. ఈనెల 19 నుంచి ప్రారంభమై రెండు రోజుల పాటు జరిగిన మేమంతా బస్సుయాత్ర జన ప్రభంజనంలా సాగింది. ఈ నేపథ్యంలో ఈ నెల 29న సోమవారం చోడవరంలో ప్రచారభేరి మోగించడానికి రానున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు చోడవరం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు సిద్ధమయ్యారు. కొత్తూరు జంక్షన్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలనుద్దేశించి సీఎం ప్రసంగించనున్నారు. ఐదేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు తాజాగా విడుదల చేసిన నవరత్నాల ప్లస్ మ్యానిఫెస్టో గురించి వివరించనున్నారు.

సభా ఏర్పాట్లు పరిశీలించిన వైవీ సుబ్బారెడ్డి

సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను ఆదివారం ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ , జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, నియోజకవర్గం పరిశీలకుడు శరగడం చిన అప్పలనాయుడు పరిశీలించారు. చోడవరం సమీపంలో జరుగుతున్న హెలీ ప్యాడ్ పనులను పరిశీలించి అధికారులకు తగిన సూచనలిచ్చారు.

భారీ బందోబస్తు..

సీఎం వై.ఎస్.జగన్ పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నానికే పోలీసు బలగాలు చోడవరం చేరుకున్నాయి. సీఎం పర్యటన రూట్‌ను, బహిరంగ సభ స్థలాన్ని జిల్లా ఎస్పీ మురళీకృష్ణ పరిశీలించారు. ఇటీవల సీఎం వై.ఎస్.జగన్‌పై జరిగిన హత్యాయత్నం ఘటనను దృష్టిలో ఉంచుకుని పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో పాటు భారీగా పోలీసు సిబ్బందిని బందోబస్తు విధులకు కేటాయించారు.

నేడు సీఎం పర్యటన ఇలా..

సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం ఉదయం 8.45 గంటలకు తాడేపల్లిలో గల తన నివాసం నుంచి రోడ్డు మార్గం గుండా 9.5 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 9.15 గంటలకు విమానమార్గంలో బయలుదేరి 10.05 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి చోడవరంలో గల హెలిప్యాడ్ వద్దకు 10.35 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 10.55 గంటలకు కొత్తూరు జంక్షన్ వద్ద నిర్వహించే బహిరంగ సభ వద్దకు చేరుకుంటారు. 11 గంటల నుంచి 11.45 గంటల వరకూ బహిరంగ సభ జరుగుతోంది. అనంతరం అక్కడ నుంచి బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో అంబేడ్కర్ జిల్లాకు వెళతారు.

ఎన్ని కుట్రలు చేసినా వైఎస్సార్‌సీపీదే విజయం

రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి

పెదగంట్యాడ: ఎవరెన్ని కుట్రలు చేసినా అంతిమ విజయం వైఎస్సార్ సీపీదేనని ఆ పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఆటోనగర్‌లోని వైవా ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రెడ్డి సోదరుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కోటి 80 లక్షల కుటుంబాలు ఉంటే అందులో కోటి 10 లక్షల కుటుంబాలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వలన మేలు జరిగిందని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కొనే శక్తి లేకపోవడంతో చంద్రబాబు నాయుడు ఇతర పార్టీ నాయకులను కలుపుకొని ఈ ఎన్నికలకు వస్తున్నారని, వారి కుట్రలు ఫలించవని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ఈ ఎన్నికలు వైఎస్సార్‌సీపీకి ఎంతో కీలకమని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. రెడ్డి సోదరుల సహకారంతో మరోసారి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. ఎంతోకాలంగా ఈ ప్రాంతంలో ఉంటున్న రెడ్డి సోదరులను బీసీలో చేర్చాలని కోరుతున్నారని, ఆ విషయం ముఖ్యమంత్రి పరిశీలనలో ఉందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన మూడు నెలల్లో క్యాబినెట్‌లో పెట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని వివరించారు. గాజువాక నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అమర్‌నాథ్‌ను, విశాఖ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి

లక్ష కోట్లతో 'విజన్ విశాఖ': ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ

విశాఖ పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పేదలకు న్యాయం చేశారని చెప్పారు. సంక్షేమ పథకాలను శతశాతం అమలు చేశారన్నారు. విశాఖను పరిపాలనా రాజధానిగా చేసి రూ.లక్ష కోట్లతో విజన్ విశాఖ పేరుతో అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్ సిద్ధంగా ఉన్నారన్నారు. విశాఖ నగరంలో మెట్రో రైలు ప్రాజెక్ట్ సిద్ధంగా ఉందన్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్లలో గాజువాకను ఎంతో అభివృద్ధి చేశామన్నారు. గాజువాక నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ గాజువాకను మరింతగా అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, కొయ్య భారతి, నిర్మలా రెడ్డి, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, రాజారెడ్డి, ఎస్ఎస్ రెడ్డి, కొయ్య దేవకుమార్‌రెడ్డి, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, నాగురెడ్డి, తిప్పల స్వాతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్య ఏదైనా.. సత్తిబాబు మీ వెంటున్నాడు..

- మంత్రి బొత్స సత్యనారాయణ
- విశాఖలో నివసిస్తున్న ఉత్తరాంధ్ర వాసులతో ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: 'మీ సమస్య ఏదైనా.. ఏ అవసరమొచ్చినా బొత్స సత్తిబాబు మీ వెంట ఉన్నాడు. అన్నదమ్ముడిగా మీ మధ్య పెరిగాను.. మీ ప్రోత్సాహంతోనే రాజకీయాల్లో ఈ స్థాయికి చేరాను.. ఆ ఆదరణ ఎల్లప్పుడూ నాకు, మా పార్టీకి కావాలి'అంటూ రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ ఉత్తరాంధ్ర వాసుల ఎదుట తన ఆకాంక్షను వెల్లడించారు. విశాఖ నగరంలో నివసిస్తున్న ఉత్తరాంధ్ర వాసుల ఆత్మీయ సమావేశం లాసన్స్ బే కాలనీలోని వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ కార్యాలయంలో జరిగింది. మంత్రితో పాటు బొత్స ఝాన్సీ పాల్గొని ఉత్తరాంధ్ర వాసులను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర ప్రజల అభివృద్ధే లక్ష్యంగా రాజకీయాల్లో సేవలు అందించానన్నారు. ఇందుకు అనుగుణంగానే ఉత్తరాంధ్ర ప్రజానీకం తనకు, తన కుటుంబానికి వెన్నుముకగా నిలిచిందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల తరువాత కూడా తమ నుంచి మునుపటి భరోసాను పొందవచ్చునన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఉత్తరాంధ్ర ప్రజలంతా అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ అభ్యర్థుల గెలుపునకు సైనికుల్లా పనిచేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక పేజీ ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని మంత్రి బొత్స పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగానే అవినీతికి తావులేకుండా రాష్ట్ర ప్రజలకు ఐదేళ్లుగా సుపరిపాలన అందించడంతో పాటు పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగించారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే సీఎం జగన్ వంటి నాయకుడు దేశ రాజకీయ చరిత్రలో లేరన్నారు. మేనిఫెస్టో ద్వారా రాష్ట్ర ప్రజలకు నమ్మకం, భరోసా, ధైర్యం అందించారన్నారు. ప్రతిపక్ష పార్టీల మాదిరిగా ఎలాంటి బూటకపు హామీలు ఇవ్వలేదని స్పష్టం చేశారు. విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ ప్రజల అవసరాలు తీర్చడమే సీఎం జగన్ అజెండా అన్నారు. లక్ష కోట్లతో విజన్ విశాఖ పేరిట నగరాన్ని అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ఉత్తరాంధ్ర వాసులు కష్టపడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు కోలా గురువులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు పటిష్ట చర్యలు

- అధికారులు, సిబ్బందికి దశల వారీగా శిక్షణ

మహారాణిపేట: జిల్లాలో ఎన్నికల నిర్వహణ, ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా పటిష్ట చర్యలు చేపట్టామని కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. రాష్ట్ర పోలీస్ పరిశీలకుడు దీపక్ మిశ్రా ఆదివారం జిల్లాలో పర్యటించి, స్థానిక పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వివిధ అంశాలపై చర్చించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా యంత్రాంగం తరఫున చేపట్టిన చర్యలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆయనకు కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో వివిధ దశల్లో భాగస్వామ్యం కానున్న అధికారులకు, సిబ్బందికి అనుభవజ్ఞులతో శిక్షణ ఇప్పించామని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో మాస్టర్ లెవల్ ట్రైనర్లను అందుబాటులో ఉంచామని, 15 వేల మంది ఉద్యోగులను ఎన్నికల ప్రక్రియలో ఉపయోగిస్తున్నామని వెల్లడించారు. కలెక్టరేట్‌లో ఏడు విభాగాల కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, 502 క్లిష్టమైన పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లు, వీడియో గ్రాఫర్లను అందుబాటులో ఉంచామన్నారు. అన్ని అంశాలను పర్యవేక్షించేందుకు ఏడు రకాల 110 బృందాలను నియమించామని తెలిపారు.

రూ.13.27 కోట్ల నగదు సీజ్

ఏడు పోలీస్ చెక్‌పోస్టుల ద్వారా తనిఖీలు చేస్తున్నామని, వస్తు, ధన రూపేణా ఇప్పటి వరకు రూ.13.27 కోట్ల నగదు జప్తు చేశామని కలెక్టర్ వివరించారు. సీ విజిల్ యాప్ ద్వారా 530 వినతులు స్వీకరించగా.. నిర్ణీత కాలంలో 395 వినతులను పరిష్కరించామన్నారు. వివిధ మార్గాల ద్వారా రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి రిఫర్ చేసిన 56 ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపారు. వలంటీర్లు, ఉద్యోగులు, రాజకీయ పార్టీల ప్రతినిధులపై వివిధ ఘటనల్లో కేసులు నమోదు చేసి చర్యలు తీసుకున్నామన్నారు. సీపీ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఓటేద్దాం.. భవితకు బాటేద్దాం

కలెక్టర్ మల్లికార్జున, ఎన్నికల పరిశీలకుడు అమిత్‌శర్మ పిలుపు

బీచ్‌రోడ్డు: బంగారు భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో భాగస్వాములు కావాలని, మే 13న ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున, ఎన్నికల పరిశీలకుడు అమిత్ శర్మ పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం బీచ్‌రోడ్డులో నిర్వహించిన 5కె రన్ ఉత్సాహంగా సాగింది. ఆర్కే బీచ్ వద్ద ప్రారంభమైన ఈ రన్‌ను వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత ఎన్నికల్లో 66 శాతం నమోదైన ఓటింగ్ శాతాన్ని ఈ సారి 80 శాతానికి తీసుకెళ్లేందుకు అందరూ కలిసి రావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 1991 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, అన్ని చోట్లా తగిన వసతులు కల్పించామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలో అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటుకు మించిన ఆయుధం లేదని అందరూ దాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల పరిశీలకుడు అమిత్ శర్మ మాట్లాడుతూ విశాఖలో అధికారులు, ఓటర్లను చూస్తుంటే తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సారి ఎన్నికల్లో జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలకు ఓటర్ల నుంచి మంచి స్పందన వస్తుందని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని.. మంచి భవిష్యత్ కోసం ఓటుతో నిర్ణయం తీసుకోవాలన్నారు. అనంతరం అతిథులు, ఓటర్లు లెట్స్ ఓట్ ఫర్ డెమొక్రసీ.. లెట్స్ ఓట్ ఫర్ ఫ్యూచర్ అంటూ నినాదాలు చేయించారు.



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన సైకత శిల్పం



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న దివ్యాంగురాలు, మహిళలు



5కె రన్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, ఎన్నికల పరిశీలకుడు అమిత్‌శర్మ

ఉత్సాహంగా సాగిన 5కె రన్

ఇందులో భాగంగా చేపట్టిన 5కె రన్ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. అధికారులు, యువ ఓటర్లు టీ షర్టులు, టోపీలు ధరించి ముందుకు సాగారు. విశ్వప్రియ ఫంక్షన్ హాలు నుంచి పాం బీచ్ వరకు సాగిన ర్యాలీ మళ్లీ అదే రూట్లో విశ్వప్రియ ఫంక్షన్ హాలు దాగా సాగి అక్కడ ముగిసింది. వ్యయ పరిశీలకులు రెంగరాజన్, సౌమ్య పాండే జైన్, పోలీస్ జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్, ఇతర అధికారులు ఉత్సాహంగా రన్‌లో పాల్గొన్నారు. అంతకుముందు యువ ఓటర్లు, కళాకారులు ఓటరు చైతన్యానికి సంబంధించి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. విభిన్న ప్రతిభావంతులైన ఓటర్లు కార్యక్రమంలో పాల్గొని ఇతరుల్లో స్ఫూర్తి నింపారు. స్వీప్ నోడల్ అధికారి రామారావు, వివిధ నియోజకవర్గాల ఆర్వోలు, జిల్లా స్థాయి అధికారులు, యువ ఓటర్లు పాల్గొన్నారు.



మోడల్ పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న అమిత్ శర్మ, జేసీ మయూర్ అశోక్

స్వీప్ ఎరీనా ఏర్పాటు

విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా స్వీప్ ఎరీనా పేరుతో మోడల్ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఎరీనాను జిల్లా ఎన్నికల పరిశీలకుడు అమిత్ శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు పండగలాంటివని, ఇందులో ప్రతి ఓటరూ భాగస్వామ్యం కావాలన్నారు. కాగా.. ఎరీనాలో ఓటర్ హెల్ప్ డెస్క్, నమూనా వీవీ ప్యాట్‌లను అందుబాటులో ఉంచారు. పది రోజుల ఈ ఎరీనాలో సేవలు వినియోగించుకోవచ్చు. తూర్పు నియోజకవర్గ ఆర్వో, జేసీ కె.మయూర్ అశోక్, స్వీప్ అధికారులు పాల్గొన్నారు.

'సాయిరాం' దందా

- అడ్డగోలుగా పార్కింగ్ ఫీజు వసూలు
- అనుమతులు, జీఎస్టీ లేకుండా దోచుకుంటున్న పార్లర్ యాజమాన్యం
- ఏమాత్రం పట్టించుకోని అధికారులు



జీఎస్టీ, ఇతర వివరాలు లేకుండా ఇస్తున్న పార్కింగ్ రసీదు

విశాఖ సిటీ: అక్కడ ఏదైనా తినాలంటే.. బిల్లుతో పాటు పార్కింగ్‌కు చదివించుకోవాలి. స్టార్ హోటళ్లలో అయినా తినే ఫుడ్‌కి చెల్లిస్తే సరిపోతుంది. కానీ ఈ పార్లర్‌లో మాత్రం రూ.50 పెట్టి తినే ఇడ్లీకి కూడా రూ.20 పార్కింగ్ ఫీజు చెల్లించాలి. అలా అని సంబంధిత శాఖ అనుమతులు, జీఎస్టీ ఉందనుకుంటే.. పొరపాటే. బిల్లుపై అవేవి ఉండవు. అనుమతులు లేకుండా పార్కింగ్ ఫీజు ఎలా వసూలు చేస్తున్నారని ఎవరైనా ప్రశ్నిస్తే అక్కడి సిబ్బంది నోరెళ్లబెట్టడం మినహా ఎటువంటి సమాధానం రాదు. అది ఎక్కడో కాదు.. నగర నడిబొడ్డున డైమండ్ పార్క్ వద్ద ఉన్న సాయిరాం పార్లర్. ఈ పార్లర్ యాజమాన్యం పార్కింగ్ దందాకు తెరలేపింది. ఎటువంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తోంది. అలా అని పార్కింగ్‌లో వాహనాలు సురక్షితంగా ఉంటాయా? అంటే.. కొద్ది రోజుల క్రితమే ఇక్కడ పార్క్ చేసిన కారు అద్దం పగలగొట్టి లోపల ఉన్న నగలు, నగదు కొందరు అపహరించారు. దీనికి ఆ సదరు పార్లర్ యాజమాన్యం తమకు ఎటువంటి సంబంధం లేదని చేతులు దులుపేసుకుంది. అధికారులు సైతం మామూలు (రా)గానే చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

మాల్స్ తరహాలో దోచుకుంటున్న సాయిరాం

షాపింగ్ మాల్స్, మల్టీ ప్లెక్స్ వంటి భారీ వ్యాపార సముదాయాల కంటే సాయిరాం పార్లర్ యాజమాన్యం అడ్డంగా దోచుకుంటోంది. గంటకు ఇంత అని వాహనదారుల జేబులకు చిల్లుపెడుతోంది. స్టార్ హోటళ్లు సైతం ఉచితంగా పార్కింగ్ సౌకర్యం కల్పిస్తుంటే.. ఈ పార్లర్ మాత్రం పక్కనున్న స్థలంలో వాహనాల పార్కింగ్ గంట లెక్కన వసూలు చేస్తోంది. ఆ పార్కింగ్ రసీదులో కూడా జీఎస్టీ, ఇతర వివరాలు లేకుండా ఖాళీగానే ఇస్తుండడం విశేషం. విశాఖలో మరెక్కడా లేని విధంగా సాయిరాం పార్లర్ అనధికారికంగా పార్కింగ్ ఫీజు వసూలు చేయడం గమనార్హం.

రోడ్ల మీదే పార్కింగ్

సాయిరాం పార్లర్‌కు వచ్చే వాహనదారులతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అనేక మంది వాహనదారులు పార్లర్‌కు ముందు, ఎదురు రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోడ్డు చిన్నదై ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. డైమండ్ పార్క్ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు సాయిరాం పార్లర్ కారణంగా ఇబ్బందులు కలుగుతున్నా అధికారులు మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. రోడ్లపైనే వాహనాలు నిలిపి పార్లర్‌కు వెళుతున్నా పోలీసులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అదే ఇతర వ్యాపార సంస్థ ముందు ఇదే తరహా పరిస్థితి ఉంటే వారిపై చర్యలకు ఉపక్రమిస్తుంటారు. లేదా పార్కింగ్ సౌకర్యం కల్పించుకోవాలని ఒత్తిడి తీసుకువస్తారు. సాయిరాం పార్లర్ విషయంలో మాత్రం చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. సాయిరాం పార్లర్‌కు ఆనుకొని ఉన్న స్థలం ఉంది. అందులో పార్లర్‌కు వచ్చే కస్టమర్లకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని యాజమాన్యానికి మాత్రం చెప్పడం లేదు. ఇదే అదనుగా చూసుకుని సాయిరాం పార్లర్ యాజమాన్యం ఆ ఖాళీ స్థలంలో వాహనాల పార్కింగ్‌కు అడ్డగోలుగా ఫీజు వసూలు చేస్తోంది. దీనిపై కొంత మంది వాహనదారులు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి ఫలితం ఉండడం లేదంటున్నారు. సదరు యాజమాన్యం మామూళ్ల వ్యవహారం కారణంగా అధికారులు దీనిపై దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

'సాక్షి' మాక్ ఈఏపీసెట్‌కు విశేష స్పందన

తగరపువలస: సాక్షి మీడియా గ్రూప్, ఐసీఎఫ్ఏఐ విశ్వవిద్యాలయం సంయుక్తంగా శని, ఆదివారాల్లో నిర్వహించిన సాక్షి మాక్ ఏపీఈఏపీసెట్–2024కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఆనందపురం మండలం శొంఠ్యాం ఎస్ఎస్ఆర్ఐటీకి చెందిన ల్యాబ్‌ల్లో ఆన్‌లైన్‌లో జరిగిన సాక్షి మాక్ టెస్టులో శ్రీ చైతన్య, శ్రీవిశ్వ తదితర విద్యాసంస్థల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మాక్ టెస్టు వల్ల తాము ఎంత వరకు చదువుకున్నాం.. ఏఏ విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి.. ఏ ప్రశ్నలకు ముందుగా జవాబు రాయాలి.. పరీక్షను ఎదుర్కొనే విధానం.. సమయపాలన వంటి అంశాలపై అవగాహన కలిగిందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన పరీక్షను ఎస్ఎస్ఆర్ఐటీ ప్రిన్సిపాల్ ఎస్.శంభుప్రసాద్, పర్యవేక్షకులు చందు, శ్రీ చైతన్య, శ్రీ విశ్వ ప్రతినిధులు సురేష్, పి.సూర్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు.


సాక్షి మాక్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

మంచి మార్కులకు సూచిక


మాక్ టెస్టు బాగా రాశాను. దీనిని బట్టి నేను ఇంకా మంచి మార్కులు సాధించుకోవడానికి ఏం చేయాలో తెలిసింది. మ్యాథ్స్ 2బీ ఇంకా ప్రిపేర్ కావడానికి సూచికగా ఈ టెస్టు ఉపయోగపడింది. – బి.జలంధర్, తుని

సన్నద్ధతకు సరైన మార్గదర్శి


నేను ఏపీఈఏపీసెట్‌కు కష్టపడి ప్రిపేర్ అవుతున్నాను. సాక్షి మాక్ టెస్టు వల్ల నేను ప్రిపేర్ అయిన సిలబస్ చెక్ చేసుకోవడానికి ఉపయుక్తంగా నిలిచింది. మంచి ర్యాంకు సాధించగలననే నమ్మకం వచ్చింది. – ఎం.వెన్నెల, బొబ్బిలి

ఆందోళన దూరమైంది


ఏపీఈఏపీసెట్ మాక్ పరీక్ష రాయడం వల్ల నాలో ఆందోళన దూరమైంది. సహజంగా ఆన్‌లైన్ పరీక్షలు ఎదుర్కొనే విద్యార్థులు ఒత్తిడికి గురవుతుంటారు. ఈ పరీక్ష కారణంగా ఒత్తిడి నుంచి దూరం కావడం ఎలాగో కిటుకు తెలిసింది. ఇప్పుడు మెయిన్ పరీక్షను ఉత్సాహంగా ఎదుర్కొంటా. – ఎం.యామిని, యలమంచిలి

పరీక్షపై అవగాహన పెరిగింది


ఏపీఈఏపీసెట్ రాసే విధానంపై పూర్తిగా అవగాహన కలిగింది. మాక్ టెస్ట్ నిర్వహించిన సాక్షి మీడియా గ్రూప్, ఐసీఎఫ్ఏఐ విశ్వవిద్యాలయం వారికి ధన్యవాదాలు. పరీక్షలో ఆందోళన చెందకుండా నాలాంటి విద్యార్థులకు ఇలాంటి మాక్ టెస్టులు దోహదపడతాయి. – బి.చరణ్, మాడుగుల

సమయపాలనపై అవగాహన


ఏపీఈఏపీసెట్ మాక్ పరీక్ష రాయడం వల్ల సమయపాలనపై అవగాహన పెరిగింది. ఏ విభాగానికి ఎంత సమయం కేటాయించాలో తెలిసింది. ఇలాంటి పరీక్షలు తరచూ అన్ని పోటీ పరీక్షలకు నిర్వహిస్తే బాగుంటుంది. నిర్వాహకులకు కృతజ్ఞతలు. – ఎం.జోషిక, సబ్బవరం

ప్రశ్నాపత్రం రూపకల్పన బాగుంది


సాక్షి మాక్ టెస్టుకు రూపొందించిన ప్రశ్నాపత్రం రూపకల్పన బాగుంది. వచ్చే నెలలో జరగనున్న ఏపీఈఏపీసెట్‌కు ఇవే ప్రశ్నలు వస్తాయా అనేలా ఉంది. ఏఏ సబ్జెక్టుల నుంచి ఏఏ ప్రశ్నలు వస్తాయో నిశితంగా పరిశీలించి సెట్ చేసినట్టు ఉంది. – ఎం.వి.ఎస్.జ్యోత్స్న, విజయనగరం

డిఫరెంట్‌గా మాక్ టెస్ట్


ఇంటర్మీడియట్‌లో నాకు మంచి మార్కులు వచ్చాయి. ఏపీఈఏపీసెట్‌కు ప్రిపేరవుతూ ఎన్నో మోడల్ పేపర్లు ఆన్సర్ చేశాను. సాక్షి మాక్ టెస్టు చాలా డిఫరెంట్‌గా ఉంది. సిలబస్ పార్టు బాగా కవర్ చేశారు. నిర్వాహకులకు కృతజ్ఞతలు. – ఎ.హర్షిత, కోల్‌కతా

కొండంత ధీమా కలిగింది.


మాక్ టెస్ట్ నిర్వహణ చాలా బాగుంది. ఈ పరీక్ష రాయడం వల్ల నాలో కొండంత ధీమా కలిగింది. ఇప్పుడు ఏపీఈఏపీసెట్‌ను ఎదుర్కోగలను. మంచి ర్యాంకు సాధించగలననే భరోసా కలిగింది. – ఆర్.రోషిణి, విజయనగరం

మంచి తోడ్పాటు


ఏపీఈఏపీసెట్‌ను ధైర్యంగా ఎదుర్కోగల సత్తా సాక్షి మాక్ టెస్టు ద్వారా లభించింది. నాలాంటి ఎందరో విద్యార్థులకు వీలుగా మాక్ టెస్ట్ నిర్వహించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు. పరీక్ష ఎలా ఉంటుందో ముందే అవగాహన పొందగలిగాం. – పి.రవిశంకర్, బొబ్బిలి

మాకెంతో మేలు..


సాక్షి మాక్ టెస్టు ద్వారా ఏపీ ఈఏపీసెట్ పరీక్ష విధానం ముందుగానే తెలిసింది. మిగిలిన రోజులు మరింతగా సబ్జెక్టుపై పట్టు సాధించడానికి, ఉత్తమ ర్యాంక్ సాధించడానికి మాక్‌టెస్ట్ ఎంత గానో ఉపయోగపడింది. – డి.జాహ్నవి, సోంపేట

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	400.00
విజయనగరం	404.00
శ్రీకాకుళం	404.00

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.140
స్కిన్	: రూ.250
స్కిన్‌లెస్	: రూ.260

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు


వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: ఆనందపురం మండలం కణమాం, కుశలవాడ, ముచ్చర్ల, శిర్లపాలెం, ముకుందపురం పంచాయతీల నుంచి 300 మంది టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, విశాఖ రాజధాని వంటి అంశాలు నచ్చి పార్టీలో చేరుతున్నట్టు ప్రకటించారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ముత్తంశెట్టి శ్రీనివాసరావును ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీలక్ష్మిని ఎంపీగా గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు.

- ఆనందపురం పంచాయతీకి చెందిన 18 మంది వలంటీర్లు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో ఆదివారం రాజీనామా చేశారు. సీఎం వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావడానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు పరదేశిపాలెం, ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాలకు చెందిన యువకులు, ఇతర పార్టీలకు చెందిన 60 మంది కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన హనుమంతురావు ఆధ్వర్యంలో పార్టీలో చేశారు. కార్‌షెడ్ జంక్షన్ వద్ద గల పార్టీ ఎన్నికల కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ అభ్యర్థుల విజయానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వార్డు జేసీఎస్ కన్వీనర్ పోతిన సురేష్‌కుమార్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

300 మంది ఆటోడ్రైవర్ల చేరిక


వైఎస్సార్ సీపీలో చేరిన ఆటో డ్రైవర్లతో మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించిన మంత్రి అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: గాజువాకకు చెందిన 300 మంది ఆటోడ్రైవర్లు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ మొల్లి చిన్న ఆధ్వర్యంలో మిందిలోని మంత్రి నివాసంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్లు మాట్లాడుతూ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఆటో డ్రైవర్ల సంఘాల నాయకులు పాల అప్పలరెడ్డి, చీపురుపల్లి అప్పారావు, ధర్మాల అచ్చిబాబు, ధర్మాల అప్పలరెడ్డి, ధర్మాల అప్పలస్వామి, గురుపల్లి కోటేశ్వరరావు, గొందేశి అప్పల రెడ్డి, ధర్మాల అప్పారావు, పంది లక్ష్మణరావు, పులి అప్పారావు, ధర్మాల వాసు, గొందేశి అప్పన్న, గొల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీలు వైఎస్సార్ సీపీకి వెన్నెముక


మాట్లాడుతున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థులు బొత్స ఝాన్సీ, కె.కె.రాజు, పార్టీ నేతలు సనపల చంద్రమౌళి, కోలా గురువులు తదితరులు

- అన్ని సామాజిక వర్గాలకూ సీఎం జగన్ సమన్యాయం
- కళింగ ఆత్మీయ సమ్మేళనంలో రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి


మంత్రి బొత్సకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి

మద్దిపాలెం: వైఎస్సార్ సీపీలో బీసీలకు అత్యధిక ప్రాధాన్యం ఉందని, వారే పార్టీకి వెన్నెముక అని పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. 51వ వార్డు మాధవధార లేన్సమ్‌గ్రీన్స్ అపార్ట్‌మెంట్ వద్ద మాధవధార కళింగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కళింగ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. వీఎంఆర్డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి సభాధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని కులాల వారికి సముచిత న్యాయం చేశారన్నారు. అన్ని వర్గాలకు అత్యధిక ప్రాధాన్యం ఒక్క వైఎస్సార్ సీపీలోనే దక్కిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి ఇంకా మెరుగ్గా కొనసాగాలంటే వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కళింగుల సామాజిక వర్గానికి సీఎం జగన్ ఒక ఎంపీ, మూడు ఎమ్మెల్యే పదవుల తోపాటు విశాఖ నగరంలో వీఎంఆర్డీఏ చైర్మన్ పదవిని కూడా కేటాయించారన్నారు. ప్రతి ఒక్కరూ బొత్స ఝాన్సీ, కె.కె.రాజులను గెలిపించుకోవాలని కోరారు. బొత్స ఝాన్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటించి ఉత్తరాంధ్ర ప్రజలపై ఆయన ప్రేమ చూపించారని, మెగా గ్లోబల్ సిటీగా విశాఖ అభివృద్ధి చెందుతోందన్నారు. కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ కళింగ సామాజిక వర్గానికి ఎంతో ప్రాధాన్యమిచ్చారని చెప్పారు. విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించుకుంటే కేంద్ర ప్రభుత్వపరంగా ఉన్న సమస్యల పరిష్కారం సులభతరమవుతుందన్నారు. వైవీ సుబ్బారెడ్డి, బొత్స ఝాన్సీ, కె.కె.రాజులను చంద్రమౌళి, కళింగులు సత్కరించారు. కార్యక్రమంలో మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పశ్చిమ ఎన్నికల పరిశీలకులు పేడాడ రమణికుమారి, విశాఖ జిల్లా కళింగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పేడాడ నరసింహరావు, 50, 51 వార్డుల కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, వార్డు అధ్యక్షురాలు పి.సునీత, డైరెక్టర్లు పైడి శ్రీను, సనపల రవీంద్ర భరత్, ఆనందసింగ్, కళింగ సామాజిక వర్గ ప్రజలు పాల్గొన్నారు.

గంజాయి, మత్తుపదార్థాలు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మద్దిపాలెం: గంజాయి, మత్తు మాత్రలు విక్రయిస్తున్న వ్యక్తిని ఐదోపట్టణ పోలీసులు అరెస్ట చేశారు. ఆదివారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో కప్పరాడ ఆంజనేయ స్వామి గుడి వద్ద అదే ప్రాంతానికి చెందిన పెద్దాడ అప్పలరాజు ఓ ప్యాకెట్ గంజాయి, ఓ ప్లాస్టిక్ కవర్‌లో స్పాస్మో–ప్రోక్సివన్ ప్లస్, నైట్రాజిపామ్ టాబ్లెట్లు(271) విక్రయించడానికి సిద్ధంగా ఉన్నాడు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ భరత్‌కుమార్ రాజు, ఐదో పట్టణ ఎస్ఐ షేక్ సమీర్ దాడులు నిర్వహించారు. పోలీసులను చూసి తప్పించుకోవడానికి ప్రయత్నించడంతో అతడిని పట్టుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారించగా.. ఇతడు చెడు అలవాట్లకు బానిసై ఒడిశా నుంచి తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడని తేలింది. అతడి వద్ద నుంచి రెండు కేజీల గంజాయి, మత్తు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌కు తరలించారు.

ప్రచార పర్వం


కంచరపాలెం రైతుబజారు వద్ద గొడుగు నీడలో ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు


వైఎస్సార్ కాలనీలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి, యాంకర్, నటి శ్యామల


జీవీఎంసీ 31వ వార్డులో ప్రచారం చేస్తున్న మేయర్ గొలగాని హరి వెంకటకుమారి


88వ వార్డు నరవలో వైఎస్సార్ సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్‌కు హారతులు పడుతున్న అక్కచెల్లెమ్మలు


72వ వార్డులో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ గాజువాక అభ్యర్థి అమర్‌నాథ్ సతీమణి హిమగౌరి


అబిడ్‌నగర్‌లో నవ దంపతులకు కరపత్రం అందజేసి.. వైఎస్సార్ సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు ఓటు వేయమని అభ్యర్థిస్తున్న బాణాల తరుణ్